క్లుప్తంగా

ఆరు దుకాణాలకు వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం చర్చివీధిలోని జీవ కారుణ్య సత్రానికి సంబంధించిన ఆరు దుకాణాలను శుక్రవారం వేలంపాట నిర్వహించారు. ఈ పాటకు 20 మంది వరకు పాల్గొనగా, పోటాపోటీగా పాటపాడారు. పాట ప్రకారం నెలకు ఆరు దుకాణాలకు గాను రూ.21,700 ఆదాయం రానున్నట్లు ఈవో తిమ్మారెడ్డి తెలిపారు. దుకాణ యజమానులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు.

ఘనంగా ఆడిపూజలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం సంతపేట, ఇందిరానగర్, మురకంబట్టు తదితర ప్రాంతాల్లోని నాగాలయ్మ, గ్రామదేవత అమ్మవారి ఆలయాల్లో ఆడిపూజలు ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో ఉదయం అమ్మవారికి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసి పలు రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అర్చకులు అర్చన చేసి తీర్థ ప్రసాదం అందజేశారు. ఆలయం వద్ద ఉన్న పుట్టకు పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

నాగదేవతకు ప్రత్యేక పూజలు



గుడిపాల: మండలంలోని గురుగునత్తం గ్రామంలో ఉన్న గురుగూరమ్మ దేవాలయంలో ఉన్న నాగాలమ్మ గుడిలో శుక్రవారం ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. శ్రావణమాసం నాగపంచమి సందర్భంగా చుట్టుపక్కల మహిళలందరూ పాల్గొని నాగదేవతలకు పూజలు చేసి మొక్కులను చెల్లించుకున్నారు. దీంతో పాటు భద్రకాళమ్మ దేవాలయం వద్ద నాగదేవతకు ప్రత్యేకంగా పూజలు చేశారు. దీంతో పాటు మహిళలందరూ ఆయా గ్రామాల్లో పుట్టల వద్ద పూజలను నిర్వహించారు.

ముహూర్తం భళా..!



పెళ్లి సంబరాలతో వినాయక ఆలయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శ్రావణ మాసం ప్రారంభం కావడంతో శుభ ముహూర్తాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం మంచి ముహూర్తం కావడంతో పెళ్లి నిశ్చిర్థాలు, పెళ్లిళ్లు జోరుగా సాగాయి. ఇందుకు చిత్తూరు నగరం కట్టమంచిలోని శ్రీవినాయకస్వామి వేదికైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆ ఆలయ ఆవరణం జనసందడిగా కనిపించింది. ఆలయ పరిసరాలు నిశ్చిర్థాలు, పెళ్లి వేడుకలతో కళకళలాడాయి.

మ్యాంగో బోర్డుకోసం వినతి

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు జిల్లాలో మ్యాంగో బోర్డును ఏర్పాటు చేయాలని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్వర నాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి తదితరులు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌కు విన్నవించారు. ఢిల్లీలో శుక్రవారం వారు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో కేంద్రమంత్రిని కలిశారు. జిల్లాలోని రైతులు ప్రధానంగా మామిడి పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే తోతాపురి మామిడికి కనీస మద్దతు ధర ఇవ్వకుండా ఏటా గుజ్జు పరిశ్రమల యాజమాన్యాలు దోపిడీ చేస్తున్నాయని తెలియజేశారు. కావున టన్నుకు రూ.25000 మద్దతు ధర ఇవ్వాలని కోరారు. ఇందుకోసం మ్యాంగో బోర్డులు ఏర్పాటు చేయాలని వారు వినతిలో కోరారు.

ఓరియెంటేషన్ డే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరులోని విజయం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఘనంగా ఓరియెంటేషన్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ మాట్లాడుతూ నూతన ఒరవడిని సృష్టించడంలో విజయం విద్యాసంస్థ ఎల్లప్పుడూ ముందజంలో ఉంటుందన్నారు. విద్యారంగంలో అనేక మార్పులకు శ్రీకారం చుడుతున్నారని వెల్లడించారు. అందుబాటులోని వనరులు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని రాణించాలని కోరారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతినాయుడు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులు అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యాసంస్థ చైర్మన్ తేజోమూర్తి మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు అవసరమైన అన్ని నైపుణ్యాలను మొదటి సంవత్సరం నుంచే అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ శైలజ, ప్రిన్సిపల్ గోపి పాల్గొన్నారు.

కడుపులోనే చిదిమేస్తున్నారు

వివాహేతర సంబంధాల వల్లనో.. లేక ఆడబిడ్డ భారమవుతుందనో.. వారసుడి కోసమో తెలియదు కానీ జిల్లాలో గర్భస్థ శిశువును అక్కడే తుంచేస్తున్నారు. పూర్తిగా రూపం కూడా నోచుకోని పిండాన్ని చిదిమేస్తున్నారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరమంటూ వైద్యాధికారులు హెచ్చరికలు చేస్తున్నా పట్టించుకునే వారే లేరు. ఇలాంటి అబార్షన్ల కోసం పక్క రాష్ట్రం నుంచి తరలివస్తున్నారు. ఇక్కడ ఇలాంటి చట్ట వ్యతిరేక స్కానింగ్‌లు, అబార్షన్లు యథేచ్ఛగా చేస్తున్నారు. ఆర్‌ఎంపీ క్లినిక్‌లు, స్కానింగ్ కేంద్రాల్లో ధనార్జనే లక్ష్యంగా ముందుకెళుతున్నారు.

- అడ్డగోలుగా స్కానింగ్‌లు
- గుట్టుగా లింగనిర్ధారణ
- ఇష్టారాజ్యంగా అబార్షన్లు
- ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ఆర్‌ఎంపీ కనుసన్నల్లోనే వ్యవహారం



చిత్తూరు రూరల్ (కాణిపాకం): పైసలిస్తే చాలు పుట్టబోయే బిడ్డ ఆడా మగా అని చెప్పేస్తున్నారు.. కాసులకు కక్కుర్తి పడి పలువురు వైద్య సిబ్బంది లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ ఆడపిల్ల అయితే కడుపులోనే చిదిమేస్తున్నారు. గర్భంలో పెరుగుతున్న పిండానికి చావుగంట మోగిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో, పల్లెల్లో ఆర్‌ఎంపీలు యథేచ్ఛగా ఈ తంతు సాగించేస్తున్నారు. గతంలో చిత్తూరులో పనిచేసే వైద్యురాలు నిర్వహిస్తున్న ఒక ఆస్పత్రి, ఆర్‌ఎంపీ క్లినిక్‌ను కొన్నేళ్ల కిందట వైద్యారోగ్య శాఖ సీజ్ చేయడంతో కొంతకాలం ఈ దందాకు అడ్డుకట్టపడింది.

చిత్తూరు నగరంలో 45కు పైగా స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. వీటిలో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. మరి కొందరు అనధికారికంగా స్కానింగ్ సెంటర్లను ఏర్పాటు చేసుకున్నారు. ఇందులో ఆర్‌ఎంపీలుగా చలామణి అవుతున్న కొంత మంది కూడా ఉన్నారు. వీరి దగ్గర పని చేసే కొందరి మహిళలద్వారా అబార్షన్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు భగ్గుమంటున్నాయి.

నిబంధనలు గాలికి..

లింగనిర్ధారణ చేయవద్దన్న నిబంధనలను స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు తుంగలో తొక్కుతున్నారు. అధిక మొత్తంలో డబ్బులు ఇస్తే చాలు పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అనే విషయాన్ని చెబుతున్నారు. దీంతో తమకు పుట్టబోయే బిడ్డ ఆడపిల్ల అనే విషయాన్ని జీర్ణించుకోలేని కొందరు అబార్షన్ల వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం. మరి కొందరు ప్రేమికులు. ఇతర వివాహేతర సంబంధం ఉన్నవారు కడుపులో ఉన్న పిండాన్ని తీసేందుకు ఎంతటి ఖర్చుకైనా వెనకడుగు వేయడం లేదు. ఇదే అదనుగా చేసుకుని పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు, ఆర్‌ఎంపీలు అధికంగా డబ్బులు తీసుకుని అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆయా ఆస్పత్రులకు గర్భిణులను తీసుకువచ్చే విషయంలో వివిధ క్లినిక్‌లు, ప్రైవేటు ఆస్పత్రుల్లో పనిచేసే నర్సులు కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఒక్కో అబార్షన్‌కు సుమారు రూ.30వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

కానరాని తనిఖీలు

స్కానింగ్ కేంద్రాల్లో డెకాయి ఆపరేషన్ పేరిట వైద్యశాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టాలి. కానీ ఎక్కడా పని చేసిన దాఖలాలు లేవు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో, స్కానింగ్ సెంటర్లలో నిబంధనలు పాటించకపోయినా వైద్య శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు తనిఖీల సమాచారం కూడా ముందుగానే కేంద్రాల నిర్వాహకులకు తెలుస్తుండడంతో అక్రమార్కులు అంతా సర్దుకుంటున్నారు. దీని కారణంగా కర్ణాటక రాష్ట్రం నుంచి అబార్షన్‌కు అధికసంఖ్యలో వస్తున్నారని తెలుస్తోంది.

ఎప్పుడు చేస్తారంటే..

గర్భంలో శిశువు బుద్ధిమాంద్యం, తక్కువ బరువు, వివిధ రకాల రుగ్మతలతో ఉన్నప్పుడు, తల్లి ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు అబార్షన్ చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సుశిక్షితులైన స్త్రీ వైద్య నిపుణులు మాత్రమే చేయాల్సి ఉంటుంది. మరోవైపు సదరు ఆస్పత్రికి మెడికల్ టర్మినేషన్ యాక్ట్ 1,1971 ప్రకారం లీగల్ రిజిస్ట్రేషన్ ఉండాలి. గర్భం దాల్చి 12 వారాలైన తర్వాత గైనకాలజిస్టుతో పరీక్షలు చేయించుకుని తీవ్రమైన ఆరోగ్య సమస్య ఉన్నట్లు గుర్తిస్తే సదరు వైద్యుల అనుమతితో అబార్షన్ చేయవచ్చు. కానీ ఇవేవి తమకు పట్టవన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. తమను ఎవరు ఏమి చేస్తారులే అనే ధీమాతో జిల్లా పరిధిలో విచ్చలవిడిగా అబార్షన్ల దందా కొనసాగిస్తూ గర్భంలోనే చావుకేకను పుట్టిస్తున్నారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తప్పవు



జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ఇతర క్లినిక్‌లలో అబార్షన్లు నిర్వహించినట్లు తేలితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. ఆపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే వాటిని సీజ్ చేస్తాం. వీటి పర్యవేక్షణ కోసం జిల్లాలో ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటు చేశాం. అబార్షన్ జరిగినట్లు నిర్ధారణ జరిగితే డిగ్రీ రద్దు కోసం ఫిర్యాదు చేస్తాం.

–ప్రభావతిదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

బిందు సేద్యంపై సబ్సిడీ

గుడిపాల: రైతులు నీటిని ఆదా చేసుకొనేందుకు బిందు సేద్యంపై అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వం అందించే సబ్సిడీని వినియోగించుకోవాలని వ్యవసాయాధికారి మాధవి తెలిపారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో రూ.2.18 లక్షలకు మించకుండా ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. పెద్ద రైతులకు 70శాతం సబ్సిడీతో రూ.3.36లక్షల వరకు సహాయం అందజేస్తామ న్నారు. స్ప్రింక్లర్ల కోసం 55 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు చెప్పారు. కావలసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

108లో మగబిడ్డ జననం



బిడ్డను అందిస్తున్న సిబ్బంది

చిత్తూరు రూరల్ (కాణిపాకం): పురిటినొప్పులతో 108 వాహనాన్ని ఆశ్రయించిన ఓ తల్లి ఆ వాహనంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. చిత్తూరు మండలం తుమ్మింద గ్రామానికి చెందిన గర్భిణీ ప్రియ(19)కు గురువారం అర్ధరాత్రి పురిటినొప్పులు అధికమయ్యాయి. వెంటనే కుటుంబీకులు 108కి ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న అంబులెన్స్ సిబ్బంది, వర్షాన్ని లెక్కచేయకుండా గ్రామానికి చేరుకుంది. చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఆ గర్భిణి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. సుఖ ప్రసవం చేసిన సిబ్బంది శివకుమార్, మహేష్ బిడ్డను తల్లి కుటుంబీకులకు అందజేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డాక్టర్ తులసి ప్రియ తెలిపారు. నగరంలోని సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య సూచనలు, ఫ్యామిలీ మెడిసిన్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు పరీక్షల సమయంలో ఆరోగ్యం పట్ల చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్, లెక్చరర్ తిరుకుమరన్, ట్రస్ట్ ఫౌండర్ వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ తులసి ప్రియ

వినాయక సేవలో మాజీ ఉపరాష్ట్రపతి కుమార్తె

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వినాయకస్వామిని శుక్రవారం మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి కుమార్తె దీప దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు చేసి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సిబ్బంది కోదండపాణి తదితరులున్నారు.

విద్యార్థుల మానసిక దృఢత్వానికి క్లబ్‌లు



సమీక్షలో మాట్లాడుతున్న అపోలో ప్రొఫెసర్

చిత్తూరు రూరల్(కాణిపాకం): మానసిక దృఢత్వానికి విద్యార్థులకు క్లబ్‌లు ప్రాధాన్యమని అపోలో ప్రొఫెసర్ హచ్ వినోద్‌భట్ అన్నారు. నగరంలోని మురకంబట్టులో ఉన్న అపోలో విద్యాలయంలో శుక్రవారం కళాశాలకు సంబంధించిన 18 క్లబ్‌ల నిర్వహణపై ఆయన సమీక్షించారు. విద్యార్థులకు చదువులతో పాటు వ్యాయామం, యోగా, ఫొటోగ్రఫీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్, సామాజిక బాధ్యత వంటి కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. అనంతరం క్విజ్ క్లబ్ ద్వారా పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ పోతరాజు, ప్రొఫెసర్ సేతురామన్, ప్రొఫెసర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ షానీ మరియు అధ్యాపకులు వివిధ క్లబ్‌కి సంబంధించిన సభ్యులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

- మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన సమాజం
- యువతకు డీఎస్పీ హితవు

గంగవరం: యువత మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలు, పొగాకు ఉత్పత్తులు, మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోరాదని పలమనేరు డీఎస్పీ రఘువీర్‌విష్ణు హితవు పలికారు. మండలంలోని మదర్‌థెరిసా డిగ్రీ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. విద్యార్థులను ఉద్దేశించి డీఎస్పీ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే మంచి నడవడికతో భవితకు బాటలు వేసుకోవాలని, వ్యసనాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోరాదన్నారు. మంచి స్నేహితులు, మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. ఒక లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నత స్థానానికి చేరుకునేందుకు పట్టుదలతో ముందుకుపోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రగ్స్, పొగాకు వాడకం వల్ల కలిగే అనర్థాలపై పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించి నలుగురు విజేతలకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో గంగవరం సీఐ చిన్నగోవింద్, కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపల్ మధుసూదన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాగతోత్సవం



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

పూతలపట్టు: జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని పూతలపట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. కళాశాలలో శుక్రవారం ఘనంగా స్వాగతోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఆదర్శంగా ఉండాలని, కళాశాలలో ర్యాగింగ్ నిషేధమని, ఎవరైనా ర్యాగింగ్‌లకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేకంగా అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, గోవింద్, శివకుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కుంభాభిషేక మహోత్సవం



కుంభాభిషేక మహోత్సవంలో ప్రతిష్టించిన విగ్రహాలు, హాజరైన భక్తులు

తవణంపల్లె: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో శుక్రవారం శ్రీ సీతారామ లక్ష్మణ హనుమంత సమేత కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ట మహా కుంభాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం పుణ్యాహవాచనం, కలశ పూజ, గణపతి పూజ, మంగళ హారతి పూజలను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో యాగశాల ఏర్పాటు చేసి కలశాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం గణపతి, గోపూజ, గజపూజ, మహా పూర్ణాహుతి నిర్వహించారు. యాగశాలలో ఉంచిన కలశ నీటిని మేళతాళాల నడుమ పండితులు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ గోపురానికి అభిషేకం చేశారు. అనంతరం సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. రాత్రి దేవత మూర్తులకు విశేష పూజలు చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. తదనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సంపద సృష్టిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



చెత్త సేకరణ కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం : చెత్త నుంచి సంపద సృష్టిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీవో రామనాథరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం రెండో రోజు పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ఎంవోటీ పురుషోత్తం, శ్రీనివాసులు శిక్షణ ఇచ్చారు. అనంతరం శ్రీకావేరిరాజుపురం చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. వారు మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరుతుందన్నారు. అలాగే చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని తెలిపారు. మండల విస్తరణాధికారి రమేష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కుప్పం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం కుప్పం నియోజకవర్గం అల్ ఇండియా బంజారా సేవా సంఘ్ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్‌జీఓ భవనంలో నియోజకవర్గంలోని గిరిజనులు సమావేశమయ్యారు. అడవులపై ఆధారపడిన జీవిస్తున్న ఆదివాసులు జీవన విధానాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్ మునిరత్నం వివరించారు. ప్రభుత్వ రిజర్వేషన్ల ఫలాలు అందుకుని గిరిజనవర్గాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో అల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు రవి నాయక్, సభ్యులు శివాజీ నాయక్, కామరాజ్ నాయక్, చంద్రబాబు నాయక్, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వేరుశనగ సాగులో మెలకువలు అవసరం

పాలసముద్రం : రైతులు వేరుశనగ సాగులో మెళకువలు పాటించాలని డీఆర్‌సీ- డీటీసీ సహాయ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మని తెలిపారు. శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం ఏవో ఢిల్లీప్రసాద్ సమక్షంలో రైతులకు వేరుశనగ, చెరకు పంటలకు ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు పంటలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. అపరాలతో పంట మార్పిడి చేయాలని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉంటే పంట అధిక దిగుబడి ఎక్కువగా సాధించవచ్చని తెలిపారు. వేరుశనగ కోత, నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కత్తెర పురుగు యజమాన్యంపై వివరించారు. బిందు సేద్యంలో చెరకు, డ్రమ్ సీడర్ పద్ధతిలో వరిని సాగు చేసుకోవాలని సూచించారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం

ఐరాల: మాతా, శిశు మరణాలను తగ్గించేలా సురక్షిత ప్రసవాలే లక్ష్యంగా వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. పీహెచ్‌సీలో పీఎం సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పాలు, గుడ్లు, పండ్ల రసం, నీరు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు సురక్షితమన్నారు. అంగన్‌వాడీలో పంపిణీ చేసే పోషకాహారం సద్వినియోగం చేసుకుని, రక్తహీనత లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎస్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు

గుడిపాల: ప్రభుత్వాస్పత్రుల్లోనే అధికంగా కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) హనుమంతరావు అన్నారు. గుడిపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వ్యాక్సిన్, డెలివరీ రూమ్, ఫార్మసీని క్షుణ్ణంగా పరిశీలించారు. వ్యాక్సినేషన్ ప్రతి ఒక్కరికీ వేయాలని, జీరో డోస్ నుంచి ప్రతీది సక్సెస్‌ఫుల్ చేయాలని సూచనలు ఇచ్చారు. కాన్పులను ఇంకా పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంధ్య, సిబ్బంది విజయ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

దిగువతడకరలో ఫ్యామిలీ డాక్టర్

తవణంపల్లె: మండలంలోని దిగవతడకరలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రియాంక 104 వాహనంలో 40 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరాలు సోకిన వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు. 4







ఐరాల: గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, తవణంపల్లె: దిగువతడకరలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక, గుడిపాల: ఫార్మసీని తనిఖీచేస్తున్న డీఐఓ

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు ఆపరేషన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఎస్‌ఈ సురేంద్రనాయుడు తెలిపారు. 33, 11 కేవీల లైన్ల మరమ్మతుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని ఎం.ఎస్.ఆర్ కూడలి, రాజీవ్‌గాంధీవీధి, కొండమిట్ట, లాలూగార్డెన్, మిట్టూరు, నాయుడుబిల్డింగ్స్, సీబీ రోడ్డు, సంతపేట, తోటపాళ్యం, చవటపల్లె, ఇందిరానగర్, కై లాసపురం, మున్సిపాల్‌కాలనీ, దుర్గమ్మగుడివీధి, బాలాజీనగర్, కొంగారెడ్డిపల్లె, కట్టమంచి, ఎస్టేట్, బస్టాండ్, బీవీరెడ్డికాలనీలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు. జీడీనెల్లూరు, పాలసముద్రం, గుడిపాల, పూతలపట్టు, పెనుమూ రు మండలాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించాల్సిందిగా కోరారు.

పాలసముద్రం తహసీల్దార్‌కు నేతల సన్మానం

పాలసముద్రం : బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ అరుణ కుమారిని శుక్రవారం జెడ్పీటీసీ అన్నలగన్, వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రజల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎంపీడీవో గోవిందరాజులు, నాయకులు సుబ్రమణ్యరెడ్డి పాల్గొన్నారు.